# ఏడీ సూర్యుడు ?

రూప తూలుతూ నడుస్తూ ఉంది. ఆమె రెండు భుజాలూ ఇద్దరు పని మనుషులు పట్టుకున్నారు.

రూప వాళ్ళ మీద పడి నడుస్తూ ఉంది. వాళ్ళు నడిపించుకుపోతున్నారు.

కాళ్ళు నేలమీద ఆనటం లేదు. జారి పోతున్నాయి.

వాళ్ళు నడిపించటం లేదు. ఎత్తుకు పోతున్నారంటే తప్పు. లాక్కుపోతున్నారంటే ఘోరపాటు. రూప ప్రమేయం లేకుండా, రూప నడచి పోతూ ఉంది.

ముందు వాద్య సంగీతం. హోరెత్తే సంగీతం.

రూప అందగత్తె. ఆ అందం శరీరమంతా ఉంది. రంగులోనూ ఉంది. పొందికలోనూ ఉంది.

మళ్ళీ మాట్లాడితే అందం వయసులోనూ ఉంది. ఇరవై ఏళ్లలోపు వయస్సు.

ఆమె అందం చదువువల్లా వచ్చింది. పదీ పాసయింది.

ఆమె అందం తెలివి మూలంగా కూడా వచ్చి ఉండవచ్చు.

అందమైన రూప వళ్ళు మరచి నడుస్తూ వుంది. తల మీద బట్ట వేసినా ఉండటంలేదు. ఒంటిమీద బట్ట నిలవటం లేదు. కట్టు బట్టలు కాళ్ళకూ, చేతులకూ అడ్డం అవుతూ ఉన్నాయి.

పెళ్ళి అయితే కొందరి అందం ఇనుమడిస్తుంది. పెళ్ళి కళ అంటారు. దాంపత్య సౌందర్యం అనీ అంటారు.

రూపకు పెళ్ళి అయింది. కానీ అటువంటి అందం ఏమీ రాలేదు. లేదు.

చంద్రుడిలో మచ్చలాగా రూపలో మచ్చ ఉంది. అది పేదరికం.

పేదరికం చదువుకు అడ్డం వచ్చింది. పదో తరగతి బాగా పాసయినా చదువు సాగలేదు. ఆగి పోయింది.

తండ్రి రైతు, తల్లి కూలీ. ఆస్తిపాస్తులు లేవు. ఏ పూటకా పూట సంపాదించుకొంటే ఉంది. లేకపోతే పస్తు.

రూప గుణం మంచిది. నడవడిక మంచిది. నలుగుర్లో మంచి పేరుంది. ఆ మంచితనం పరిమళం లాగా చుట్టూ వ్యాపించింది.

ఆవాసన పీల్చిన వాళ్ళు ముక్కులు తడుం కోవటమే కాదు, చెవులు కొరుక్కున్నారు.

సంబంధాలు రాసాగాయి. రూపకు పెళ్ళి చేసి చేతులు కడుక్కోవాలని తల్లిదండ్రులూ సిద్ధమయ్యారు.

ఒక్కగానొక్క కూతురు. లేక లేక కలిగిన సంతానం. పెళ్ళి చేసి అత్తగారింటికి పంపటం కష్టంగానే ఉంది. కానీ తప్పదు కదా !

వచ్చిన సంబంధాల్లో ఒకటి కళ్ళు తిరిగిపోయే సంబంధం.

కుటుంబమంతా చుట్టూ నాలుగామడ పేరు మోసిన కుటుంబం.

వంశం రాజరికపు వంశం. ఆ వంశం వాళ్ళ పౌరుషానికి పెట్టింది పేరు.

పెళ్ళి కొడుకు పాతికేళ్ళ వాడు. అందగాడు. స్త్రీల సౌకుమార్యం వళ్ళంతా చోటు చేసుకొన్న అందగాడు.

రూప అందరికీ నచ్చింది. తమ ఇంటి కోడలుగా రూపవస్తే అదే పదివేలు అనుకొన్నారు అత్తామామలు. మీ యిష్టమే నా యిష్టం అన్నాడు పెళ్ళికొడుకు.

రూప తల్లి దండ్రులకు కూడా నచ్చిన సంగతి, కట్నం ప్రసక్తి లేదు, కానుకల మాట లేదు.

ఆస్తి అంతా అబ్బాయిదే! పంచుకొనే వాళ్ళు లేరు.

ఇంత ఆస్తి ఉండగా ఇంకెందుకీ కట్నం కానుకలు?

రూప అందమే కట్నం !

పెళ్ళి బాజాలు మోగాయి. వేదిక అంతా సందడిగా అయింది.

రూప తూలుతూ నడుస్తూ ఉంది. పనివాళ్ళ చేతుల మీద ముందుకు నడుస్తూ ఉంది.

ముందు బాజాలు మోగుతున్నాయి.

వాటి వెనుక జనం మందలు మందలుగా మౌనంగా నడుస్తూ ఉన్నారు.

ఊళ్ళో నుంచి బయల్దేరిన జనం ఊరి వెలుపలికి వచ్చారు. పొలిమేరకు అభిముఖంగా నడుస్తూ ఉన్నారు.

ఆర్నెల్ల క్రితం ఈ పొలిమేర దాటే ఈ ఊళ్ళోకి రూప వచ్చింది.

ఆ రోజు ఆమెను పల్లకీలో బోయీలు మోసుకొని వచ్చారు.

కొత్త బట్టలు. పసుపు బట్టలు. పెళ్ళి బట్టలు. ఎంతో అలంకారం.

ముందూ వెనుకా జనం నడుస్తూ ఉండగా రూప పల్లకీలో మహారాణిలా కూర్చుంది. రాచ కుటుంబంలో కాలు మోపటానికి పెళ్ళి కూతురై వచ్చింది.

ఊరి మొగదలే విడిది ఏర్పాటు.

ఆ రోజు పెళ్ళి పందిట్లో ఎంతమంది జనం! ఎన్ని ఊళ్ళ వాళ్ళు !

ధనవంతుల ఇళ్ళ పెళ్ళికి ఇంత మంది జనం వస్తారు.

ఇందరు బంధువులున్నారు.

ఇంత తీరుబడిగా వచ్చారు. ఇన్ని కానుకలిచ్చారు.

రూప కళ్ళు తిరిగి పోయాయి. ఎంత అట్టహాసం ! ఎంత ఉత్సాహం ! ఎంత వేడుక!

విడిది ఏర్పాట్లు, భోజనం ఏర్పాట్లు, ఊరు ఊరంతా పెళ్ళిపందిరిలా అయి పోయింది.

అంత జనాన్ని, అంత ఆనందాన్ని, తనివి తీరా చూచింది రూప. అదృష్టం అంతా తనదేనని పొంగి పోయింది ఆ రోజు. అదెంతోకాలం నిలవలేదు.

ఇప్పుడు ఇంతమంది జనాన్ని చూడటంలేదు. కళ్ళున్నాయి, కనిపించటం లేదు. తూలిపోతున్నాయి.

ఇంతమంది జనం ఆనందంతో ఉన్నారో దుఃఖంతో ఉన్నారో ఉదయం దాకా రూపకు తెలుసు. ఇప్పుడు తెలియదు.

ఇంతమంది జనం మౌనంగా నడుస్తున్న సంగతి తెలివికి మబ్బులు కమ్మిన రూపకు తెలియదు. వీళ్ళు ఇటునడిచి ఎక్కడికి పోతారో తెలియదు.

రూప రెక్కపట్టి నడిపిస్తున్న ఇద్దరు పనివాళ్ళతో కలిపి మొత్తం ముగ్గురాడవాళ్ళు తప్ప మిగతా అందరూ మగవాళ్ళే!

రూప కళ్ళు తేలిపోతున్నాయి. ఈ పనివాళ్ళు ఇద్దరూ ఇచ్చిన రెండు గ్లాసుల షరబత్ తాగిన దగ్గర్నుంచి రూప ఇలా అయిపోయింది.

వాళ్ళిద్దరూ రూపకు ప్రాణబంధువులు. అత్తవారింటికి వచ్చిన నాటినుంచి వాళ్ళ ఆత్మీయత ఆమెకు అండఅయింది.

వాళ్ళు లేకపోతే ఆమె నరకం అనుభవించేదాన్ని అనుకొంటుంది.

వాళ్ళు అత్తామామల పనివాళ్ళు అనీ, తనకు అండగా ఉన్నారనీ, రూపకు తెలియకపోలేదు.

తనకు వాళ్ళు తోడుండటం అత్తామామల మాటప్రకారమేనని రూపకు తెలుసు.

అయినా వాళ్ళు ఆత్మీయంగా ఉన్నారు. వాళ్ళమాట నమ్మింది. చేత నమ్మింది. ఇచ్చింది తాగింది.

తాగినప్పటినుంచి తలతిరిగిపోయింది. వళ్ళు తూలిపోయింది. కాళ్ళు తేలిపోయాయి.

మనిషి మనిషికాకుండా నడిచిపోతూఉంది.

పెళ్ళయిన తరువాత శోభనం ఏర్పాటు జరగలేదు.

ఎందుకనో రూపకు తెలియదు. కానీ అత్తవారింటిలోనే ఉంది.

బంధువులు వస్తున్నారు. పోతున్నారు పరాచికాలు, ప్రశంసలు, బహుమతులు, సరేసరి. అంతా బాగానేఉంది.

— అతనే బాగాలేడు. కంటికి కనబడడు. చేతికి దొరకడు.

ఏఊరూ వెళ్ళలేదు. ఇంట్లోనే ఉన్నాడు. తుష్టిగా భోంచేస్తున్నాడు.

పలుకరించడు. భావించాడు. ఎదురుకాడు. గదికిరాడు. తప్పించుకొని తిరుగుతున్నాడు.

అమ్మా నాన్న వచ్చినప్పుడు రూప ఆమాటే అంది. అది ఆధారంగా వాళ్ళు ఆచూకీ తీశారు.

పిల్లవాడి వంట్లో బాగాలేదు.

అదే రూపతో చెప్పారు. అవును కాబోలు అనుకొంది రూప.

మనిషి మామూలుగా తిరుగుతున్నాడు. అందరిలా నడుస్తున్నాడు. నవ్వుతున్నాడు.

'సిగ్గు' అనుకొంది రూప. సిగ్గుపడింది.

మనిషిలో మార్పులేదు.

రూప వయ్యారంగా ఎదురయింది.

మనిషిలో మార్పులేదు.

సుతారంగా నవ్వింది.

మార్పులేదు.

అనుకోకుండా తగిలింది.

మార్పులేదు.

అర్థరాత్రి చేయి పట్టుకొంది. బొమ్మలాగా నిలబడ్డాడు.

రూపకేమీ అర్థం కాలేదు.

పనివాళ్ళతో మాట్లాడింది. అవును కాబోలు అన్నారు.

నా గొంతు కోశారు అంది. ఏడ్చింది. అన్నం మానింది. నిద్రరాలేదు.

లంకంత ఇంటిలో ఒంటరిది అయిపోయింది. ఉండలేకపోయింది.

పుట్టింటికి బయలుదేరి వెళ్ళింది.

పరుతూ నడుస్తూ ఉన్న రూప ముందు జనం మధ్య పల్లకీ ఉన్నట్లుగా ఉంది.

పల్లకీ కాదు. పాడె!

నలుగురు మోస్తున్నారు. పల్లకీకి చేసినంత అలంకారం చేశారు పాడెకు కూడా.

వాద్య సంగీతం హోరెత్తిపోతూవుంది. పెళ్ళికున్నంత హడావుడిగా ఉంది.

తేడా అంతా ఒకటే !

ఆ రోజు పల్లకిలో వచ్చింది.

ఈ రోజు కాలినడకనపోతూ ఉంది.

ఆ రోజు ముందు పాడెలేదు. ఈ రోజు ఉంది.

ఏం జరుగుతూ ఉందో రూపకు తెలిసే స్థితిలేదు.

ఆ రోజు ఇంటికి వచ్చిన రూపను తల్లిదండ్రులు ప్రశ్నలతో హింసించారు.

'అత్తా మామలకు చెప్పివచ్చావా ?'

'లేదు.'

'భర్తకు చెప్పావా ?'

'లేదు.'

'పారిపోయి వచ్చావా ?'

పలకలేదు.

తల్లి దండ్రులు ఓర్పు వహించారు.

రూప అత్త మామలు కఠినులుకారు దయామయులు.

కట్నం అడగలేదు. బాధించరు.

కట్నం తేలేదని, తెమ్మని కాల్చి చంపరు. రాచిరంపాన పెట్టరు.

భర్త సుకుమారుడు. భార్యతో మాట్లాడటానికి కూడా సిగ్గుపడి, వయ్యారంగా వంకర్లు తిరిగిపోతాడు.

చాలా మంచివాడు. కొంచెం పిచ్చివాడు. బాగా అమాయకుడు.

కూతురెందుకు పారిపోయి వచ్చిందో తల్లి దండ్రులకు అర్థం కాలేదు.

గుచ్చి గుచ్చి అడిగితే రూప తల్లితో చెప్పింది. 'ఆడంగి రేకులోడు.'

తల్లి అదిరిపోయింది. తండ్రి బిత్తర పోయాడు.

ఏం చేయాలో దిక్కు తెలియలేదు. మౌనంగా ఉన్నారు.

వాళ్ళ భర్తే దైవం అనలేదు. చావో బ్రతుకో భర్తతోనే అనలేదు. మెదలకుండా ఊరుకొన్నారు.

అత్తా మామలు ఊరుకోలేదు. కోడల్ని పంపమని కబురు చేశారు.

జవాబు లేదు.

'మేమే వచ్చి వెంట బెట్టుకు వస్తాం అన్నారు. రాలేదు.'

'అందువల్ల పోలేదు.'

శోభనం ఏర్పాటు చేస్తున్నామని కొంత కాలానికి కబురు పెట్టారు.

'అబద్ధం' అంది రూప.

అబద్ధ మనుకొంది రూప. 'అయినా వెళ్ళి చూడకూడదా' అన్నారు తల్లి దండ్రులు.

'నేను పోను' అంది రూప.

'రూప రాదు' తల్లిదండ్రులు కబురు చేశారు.

వారం తర్వాత ఆత్మీయంగా ఉండే పనివాళ్ళిద్దరూ వచ్చారు. చావు కబురు చల్లగా చెప్పారు.

'నీ భర్త చనిపోయాడు' రూప వాళ్ళ మాటలు వింది. చలనం లేదు.

అమ్మా నాన్నా బాధ పడ్డారు. అల్లుడు చనిపోయినందుకు కాదు. కూతురు ముండ మోసినందుకు.

తల్లీ దండ్రీ రాలేమన్నారు. పీడ విరగడవుతూ ఉంది కాబట్టి పోయి గాజుపూసా ఇచ్చి రమ్మన్నారు.

పనివాళ్ళు రమ్మన్నారు.

రూప ఏడవలేదు. నిర్లిప్తంగా 'సరే' అంది. 'పదండి' అంది.

ఈ ఉదయమే పనివాళ్ళతో అత్తవారింట్లో అడుగు పెట్టింది రూప.

భర్త శవం చూచి, స్థాణువులా నిలబడిపోయింది.

ఏడవలేదు. గుండెలు బాదుకోలేదు. తల వంచుకొని కూర్చుంది. ఏమీ తినలేదు. పనివాళ్ళిచ్చిన షర్బత్ తాగింది. అప్పట్నుంచి తూలిపోతూ ఉంది.

కొంచెం సేపు ఇంట్లో జరుగుతున్న తతంగం తెలుస్తూ వచ్చింది. పాడె కట్టటం గమనించింది.

'రూపకెంత పతిభక్తి' అని తూలిపోతున్న తనను చూచి అమ్మలక్కలు అనుకోవటం వింది.

... వెర్రిగా నవ్వుకొంది.

పనివాళ్ళ చేతులు మీదపడి నడుస్తున్న రూపకు పాడెమీద ఉన్న భర్త శవం కనబడటం లేదు. పూలు ఎవరికయినా కనబడతాయి. పరిమళం ఎవరికయినా తెలుస్తుంది. సంగీతం వినబడుతుంది.

రూప పంచేంద్రియాలు పనిచేయటం మానేశాయి.

ఊరేగింపు వల్లకాట్లో ఆగింది. శవ సంస్కారానికి కట్టెల వేదిక విశాలంగా అమర్చి ఉంది.

శవాన్ని పడుకోబెట్టారు. పూలమాలలు వేశారు. పూలు జల్లారు.

అందరూ వెనక్కు చూశారు. పనివాళ్ళు నడిపిస్తుంటే నడచి వస్తున్న రూప పడిపోతూ ఉండటం చూచి జనం పరవశించి పోయారు.

పనివాళ్ళు శవం దగ్గరకు వచ్చారు. చేతుల్లో పూలమాలలాగ రూప ఉంది.

శవానికి దండవేసినట్లు పక్కనే పడుకోబెట్టారు.

శవం పక్క శవం లాగా చలనం లేకుండా పడుకొన్న రూప చేయి తీసి భర్త శవం మీద పెట్టారు పనివాళ్ళు.

జనం చప్పట్లు కొట్టారు.

బరువైన కట్టెలు తెచ్చి వాళ్ళ మీద ఉంచారు. ఇనుపతీగెలతో పై కట్టెలు కింది కట్టెలు కలిపిచుట్టారు. టిన్నుల్లోని కిరోసిన్ కట్టెల మీద పోశారు.

రూపకు స్పృహ లేదు.

ఆకాశంలో సూర్యుడు మండిపోతున్నాడు.

అగ్గిపెట్టె సూర్యుడి వారసుడు.

కాగడా పగటిపూట సూర్యుడి స్నేహితుడు.

నిప్పుల కుంపటి నివురు కప్పుకోలేదు.

గాలికి ప్రాణం వుంది.

శవానికి లేదు.

రూపకు ప్రాణం ఉంది. చైతన్యం లేదు.

సీత రాముడి సతీ తిలకం. అగ్నికి ఆమె ఆరోగ్యం తెలుసు.

భూమికి ఓర్పు ఉంది.

రూప సీత కాదు. అగ్ని అగ్గిపెట్టె కాదు. ఆనాడు కిరోసిన్ లేదు. ఈనాడు ఉంది.

ఏనాటికీ, ఈ దేశంలో స్త్రీ స్థితి ఇలాగే ఉంటుందా? ఇలాగే ఉండాలా?

ఇదా మునుల దేశం ?

ఇదా మనుషుల దేశం ?

ఇది ఏ కాలం ?

ఇది ఏ దేశం ?

కుంపటి వెలిగింది. మంట లేచింది. కాగడా అంటుకొంది.

కొరివి మండింది.

జనం చప్పట్లు కొట్టారు.

వాద్య సంగీతం మిన్నుముట్టింది. సూర్యుడు తలవంచుకొన్నాడు.

చితి మండింది.

కట్టెల పెళ పెళ వినబడింది.

పొగ ఆకాశానికి లేచింది.

చితి కదలలేదు. ఇనుపతీగెలు బిగిశాయి.

రూప అరుపులాగా, వాద్య సంగీతం లాగా కట్టెలు పగిలాయి. పేలాయి.

వాద్య సంగీతం ఆకాశం తాకింది.

చితి మంటలు చెట్టంత ఎత్తు లేచాయి.

పొగలు ఆకాశంలోకి చొచ్చుకు పోయాయి.

సూర్యుడు పొగ క్రమ్మి మసకబారిపోయాడు.

జనం చప్పట్లు కొట్టారు.

ఫాములు కాలినట్లు చితి కుమిలి కుమిలి కాలింది.

కదలిక లేదు.

నిశ్శబ్దం.

బూడిద రాశి !

జనం నమస్కరించి వెనుదిగిగారు.

నాకేం సంబంధం లేదని సూర్యుడు అస్తమించాడు.

ఏడీ సూర్యుడు ?

ఎప్పుడు ఉదయిస్తాడు ?